క్లుప్తంగా

ఉప్పు ద్రావణం పిచికారీ చేయండి

● వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రశేఖర్



వరి చేలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

విజయనగరం రూరల్: తడిచిన వరిచేల నుంచి మొలకలు రాకుండా ఉండాలంటే ఉప్పు ద్రావణం పిచికారీచేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని దుప్పాడలో వర్షాలకు తడిచిన తడి చేలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో రైతులతో ఆయన మాట్లాడుతూ, వరి కుప్పలను ఎండలో బాగా ఆరబెట్టుకోవాలన్నారు. అలాగే పెసర, మినుము పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి హర్షలత, ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

హద్దు రాళ్ల తొలగింపు



అనధికారిక లే అవుట్‌లో హద్దురాళ్లను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

విజయనగరం: ఎటువంటి నిబంధనలు పాటించకుండా అనధికారికంగా వేసిన లే అవుట్లపై కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు నగర శివారులో ఒకటో డివిజన్ పరిధిలోని స్వర్గధామం సమీపంలో నిబంధనలు పాటించకుండా వేసిన లే అవుట్‌లో హద్దు రాళ్లను సిబ్బంది గురువారం తొలగించారు. నిబంధనల ప్రకారం విజయనగరం కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన బకాయిల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కొంత స్థలాన్ని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పేరిట రిజిస్టర్ చేయాల్సి ఉన్నా అందుకు సదరు యజమాని సుముఖత వ్యక్తం చేయకపోవడంతో లే అవుట్‌లో రాళ్లను తొలగించినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్‌లు వేస్తే చర్యలు తప్పవన్నారు.

ప్రత్యేక అలంకరణలో కనక మహాలక్ష్మి



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి

విజయనగరం టౌన్: నగరంలోని సిటీబస్టాండ్ వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయంలో కొలువై ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారు గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. మార్గశిరమాసం ఏకాదశి గురువారం సందర్భంగా లక్ష్మీగణపతి హోమం, మహాలక్ష్మీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

● నగర పంచాయతీ కార్మికుల నిరసన



నగర పంచాయతీ వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల: కార్మికులకు సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు, యూనియన్ కార్యదర్శి బాబురావు డిమాండ్ చేశారు. గతేడాది డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది జనవరి 11 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 రోజుల పాటు జరిగిన సమ్మె సందర్భంగా అధికారులు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం నగర పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల మరణించిన తుపాకుల రమణమ్మ, బొమ్మాలి వెంకట్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలని.. ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షలు చెల్లించాలని.. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం నాయకులు విజయ్, పైడిరాజు , శ్రీను, లక్ష్మి, హరిబాబు, సురేష్, బాల, తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా పెద్ద చెరువు..



నీటితో కళకళలాడుతున్న పెద్దచెరువు



కల్వర్టు ద్వారా వృథాగా పోతున్న నీరు

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస పెద్ద చెరువు నిండుకుండను తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీటితో కళకళలాడుతోంది. చెరువు కింద సుమారు 214 ఎకరాల ఆయకట్టు ఉంది. రబీ సీజన్‌కు సాగునీటి ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే చెరువుకు ఓ వైపున్న కల్వర్టు నుంచి నీరు వృథాగా పోతోందని, అధికారులు స్పందించి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు



విజయనగరం రూరల్: సారికలో వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

● జేసీ సేతుమాధవన్



నెల్లిమర్ల రూరల్: సీతారామునిపేట రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

నెల్లిమర్ల రూరల్: భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని జేసీ ఎస్. సేతుమాధవన్ అన్నారు. మండలంలోని సీతారామునిపేటలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు తమ భూ సమస్యలపై దరఖాస్తులు అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అందజేసిన వినతులకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని చెప్పారు. అనంతరం రైతుల నుంచి భూ సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి, వాటిని పరిష్కరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బి. సుదర్శన రావు, ఆర్ఎస్‌డీటీ సత్యనారాయణ, ఆర్ఐ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ రాంబార్కి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం ..

విజయనగరం రూరల్: భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని ఆర్ఐ ఎస్ఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని సారిక, గొల్లలపేట గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలువురు రైతులు అడంగల్, హద్దులకు సంబంధించిన సమస్యలపై వినతులు సమర్పించారన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి పద్మావతి, సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్ బీవీఎస్‌వీఎన్ ప్రసాద్, వీఆర్‌ఓ దివ్యప్రభాకర్, సర్వేయర్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

19వ డివిజన్‌లో వార్డు పర్యటన



లంకాపట్నంలో అధికారులకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

విజయనగరం: నగరంలోని 19వ డివిజన్‌లో అధికారులు గురువారం వార్డు పర్యటన చేపట్టారు. డివిజన్ పరిధిలోని లంకాపట్నం ఆది ఆంధ్ర స్కూల్ నుంచి ప్రారంభమైన వార్డు పర్యటనలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు పాల్గొని స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, మధ్యాహ్నం భోజన పథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గురువారం వార్డు పర్యటనలు చేపడుతున్నామన్నారు. తమ పర్యటనలో గమనించిన క్షేత్రస్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. టిఫిన్ దుకాణాల వద్ద ప్లాస్టిక్ కవర్లు వినియోగాన్ని గుర్తించి మండిపడ్డారు. పాలిథిన్ ఉత్పత్తుల వినియోగాన్ని నిషేధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 31లోగా బీమా చేయించుకోవాలి



కొండవెలగాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి సంగీత

నెల్లిమర్ల రూరల్: రబీ సీజన్ పంటలకు సంబంధించి రైతులందరూ ఈ నెల 31వ తేదీ లోపు బీమా చేయించుకోవాలని విజయనగరం వ్యవసాయాధికారి సంగీత సూచించారు. మండలంలోని కొండవెలగాడలో గురువారం ఆమె పర్యటించి, మొక్కజొన్న, అపరాల పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అధిక వర్షాలకు పంటలు నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం రైతులతో ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు పాడైతే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది వేణుబాబు, వసంత, రైతులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

గుర్ల: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని సర్వశిక్ష అభియాన్ ఏఎస్‌ఓ సీహెచ్.జగన్ అన్నారు. పెనుబర్తి, కలవచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలు, గుర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను జిల్లా అకడమిక్ మానటరింగ్ కమిటీ గురువారం సందర్శించింది. పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, విద్యాబోధన పై ఉపాధ్యాయులను ఆరా తీశారు. అసిస్టెంట్ జీసీడీఓ కె.గాయత్రి, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాంలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఐ నాయకులు జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. ప్రజల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, సూరి, పైడినాయుడు, తవిటి నాయుడు, రామ్మూర్తి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు అండ సీపీఐ..

విజయనగరం పూల్‌బాగ్: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) శతాబ్ద కాలంగా పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు, కార్మిక, కర్షకులకు అండగా ఉంటూ అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిందని పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. స్థానిక అమర్‌భవన్‌లో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒమ్మి రమణ పార్టీ కార్యాలయంపై పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2024 డిసెంబర్ 26 నుంచి 2025 డిసెంబర్ 26 వరకు జిల్లా వ్యాప్తంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అప్పరుబోతు జగన్నాథం, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సునీల్, పార్టీ కార్యకర్తలు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు కారణంగా మండలంలోని డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ

● ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. ఆపస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పూల్‌భాగ్‌లోని సేవాభారతి కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 2,500 కోట్ల బకాయిలు విడుదల చేయాల్సి ఉందన్నారు. సంక్రాంతి కానుకగా మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని.. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి ఇజ్జిరోతు రామునాయుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, వీవీజే సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఏజీ తాతారావు, ఉపాధ్యక్షులు బల్లా శ్రీనివాసరావు, కె.భాస్కరరావు, ముగడ రమణ, మహిళా కన్వీనర్ జి.పద్మలత, కార్యదర్శులు ఎ.కిరణ్‌కుమార్, విశాఖ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలి ● ఎస్సై గణేష్



సతివాడలో సంకల్ప రథం ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా అడుగులు వేయాలని ఎస్సై గణేష్ సూచించారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల, జేఎన్‌టీయూ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంతో కొంత మంది యువత తమ బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు మంచి వైపు పయనించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరం

నెల్లిమర్ల: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై బి. గణేష్ పిలుపునిచ్చారు. నెల్లిమర్ల పట్టణ పరిధిలోని స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల్లో సంకల్పం రథం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వీడియోల ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకన్నకు లక్ష తులసి పూజ..



విజయనగరం మండలంలోని దుప్పాడ గ్రామ శ్రీక్షేత్రంలో కొలువుదీరిన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి లక్ష తులసి పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చాపర్తి రమేష్ ఆచార్యులు, అంపోలు లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని, గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి పాల్గొన్నారు.

- విజయనగరం రూరల్

గుంకలాంలో వైద్యశిబిరం..



విజయనగరం మండలంలోని గుంకలాం గ్రామంలో రాకోడు పీహెచ్‌సీ వైద్యులు గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామానికి చెందిన కొంతమంది చిన్నారులు అనారోగ్యం బారిన పడడంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యురాలు శ్రావణి తెలిపారు. చిన్న పిల్లల వైద్యుడు రమణమూర్తి చిన్నారులను పరీక్షించి మందులు అందజేశారు. వైద్యశిబిరంలో రాకోడు ఆస్పత్రి సిబ్బంది చిన్నారావు, సచివాలయ కార్యదర్శి శంకరరావుతో పాటు ఆశా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

- విజయనగరం రూరల్

ప్రధాన రహదారులను పరిశుభ్రంగా ఉంచాలి

● కమిషనర్ నల్లనయ్య



పారిశుధ్య నిర్వహణపై సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రధాన రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రింగ్‌రోడ్డు, దాసన్నపేట, కొత్తపేట, తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెత్త పేరుకుపోయి అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రింగ్‌రోడ్డు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద కాలువలో తీసిన పూడికలను రహదారిపై వేయడాన్ని గమనించి, తక్షణమే తొలగించాలని పారిశుధ్య పర్యవేక్షకుడు అంజిబాబును ఆదేశించారు. అలాగే ప్రజారోగ్య సిబ్బంది నిర్ణీత సమయానికి పనులకు హాజరవుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. పారిశుధ్య పనుల విషయంలో ఏ ఒక్కరు అలసత్వం వహించినా క్షమించేది లేదని స్పష్టం చేశారు.

పశువులకు అందని వైద్యం..



ఆవు పెయ్యికు కొడిసెలు పట్టడంతో చీమలమందుతో శుభ్రం చేస్తున్న రైతు దుర్గారావు



పశువు శరీర భాగాల్లో పట్టిన కొడిసెలు

విజయనగరం రూరల్: పశువులకు వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. దీంతో రైతులు, పశువుల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో పశువులకు కొడిసెలు ఎక్కువగా పడుతున్నాయి. కొడిసెలు పశువుల రక్తాన్ని పీల్చి వేస్తాయి. దీంతో పశువులు బలహీనమై జబ్బుల బారిన పడతాయి. రాకోడు గ్రామానికి చెందిన రైతు సిరిపురపు దుర్గారావుకు చెందిన ఆవుకు, దూడకు కొడిసెలు పట్టడంతో.. ఆ రైతు మందు కోసం స్థానిక రైతుసేవా కేంద్రం, జొన్నవలస పశువుల ఆస్పత్రిని సందర్శించాడు. అయితే ఎక్కడా మందు లభించలేదు. దీంతో చేసేదేమీ లేక తానే స్వయంగా పశువులను చీమల మందుతో శుభ్రం చేసుకున్నారు. ఈ విషయమై ఏడీఏ అనురాధ వద్ద సాక్షి ప్రస్తావించగా.. జొన్నవలస ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన వారు పశువుల ఆస్పత్రిని సందర్శిస్తే పేలు మందుతో పాటు అవసరమైన అదనపు మందులు కూడా ఇస్తామన్నారు.